సాక్షి నిజామాబాద్


బుధవారం । 28 । మే । 2025



డ్రైయినేజీలను..

డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు.

- 8లో ▸



తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

తీర్థయాత్రల కోసం ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చినట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జీఎం కిశోర్ తెలిపారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.9 /24.6

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పసుపు బోర్డుకు రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్



సుభాష్‌నగర్ : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని జాతీయ పసుపు బోర్డు కార్యాలయానికి కేటాయిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ పసుపు బోర్డుకు కార్యాలయం లేకపోవడంతో స్పైసెస్ బోర్డు రీజినల్ కార్యాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. బోర్డు ప్రకటించిన తర్వాత జిల్లా కేంద్రంలో అనుకూలమైన కార్యాలయం కోసం ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి లేఖ రాశారు. జిల్లా కలెక్టర్‌కు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పసుపు బోర్డు సెక్రెటరీ భవానీశ్రీ లేఖ రాసినట్లు తెలిసింది. చైర్మన్ సహా సిబ్బంది కార్యాలయం కోసం తీవ్రంగా అన్వేషించారు. చివరికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కేటాయించాలని కలెక్టర్ సైతం ప్రభుత్వానికి లేఖ రాశారు. ఎట్టకేలకు పసుపు బోర్డుకు కార్యాలయం కేటాయిండంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల కొరత రానివ్వొద్దు

- బాన్సువాడ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

వర్ని: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎరువులతోపాటు జీలుగ, పిల్లి పెసర విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. వర్ని మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులపై ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రూ.258 కోట్లతో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులు నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుతోపాటు కుడి, ఎడమ కాలువల పనులను కూడా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపీ, ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ప్రభు త్వ ఆదేశాల మేరకు నకిలీ, కల్తీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ, పోలీసు, సీడ్స్ సర్టిఫికేషన్ శాఖలు సంయుక్తంగా ఈ తనిఖీలు జరిపారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్ బు క్కులు, విత్తన ప్యాకెట్ల లాట్ నంబర్లు, గడువు తేదీ, తదితర వివరాలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, లాభాపేక్షతో కల్తీవి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు డీలర్లను హెచ్చరించారు. రైతులు లైసెన్సు కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనాలని, రసీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఏడీఏ హలీం హైమద్, ఎంఏవో మహేందర్ రెడ్డి, సీడ్ సర్టిఫికేషన్ అధికారి నగేష్, ఏఎస్సై లయాక్ అలీ, ఇతర సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాలలో 13,834 మంది విద్యార్థులకు 12,668 మంది హాజరు కాగా 1,166 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన 4వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 5,988 మందికి 5,487 మంది హాజరుకాగా 501 మంది పరీక్ష రాయలేదు. మధ్యాహ్నం 2వ, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 7,846 మందికి 7,181 మంది హాజరుకాగా 665 మంది గైర్హాజరయ్యారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఒకరు, వశిష్ట డిగ్రీ కాలేజీలో మరొకరు డిబార్ అయినట్లు చంద్రశేఖర్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో గందరగోళం..



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కుమార్తె కవిత రాసిన లేఖ నేపథ్యంలో పార్టీ శ్రేణులు గుంభనంగా ఉంటున్నారు. ఏం మాట్లాడాలో తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారు. పైకి మాట్లాడకున్నప్పటికీ కవిత లేఖలో ఉద్యమకారుల గురించి ప్రస్తావించడంపై పలువురు సీనియర్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, జాగృతిలో పనిచేస్తున్న కవులు, కళాకారులు మాత్రం కవితకు మద్దతుగా మా బలం, మా ధైర్యం, మా నమ్మకం మీరే కవితక్క అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

- కవిత లేఖ నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో అయోమయం
- అటో, ఇటో.. ఎటూ తేల్చుకోలేక పోతున్న ఉద్యమకారులు
- బహిరంగంగా మాట్లాడేందుకు ముందుకురాని పరిస్థితి
- అమెరికా నుంచి రాగానే ఎమ్మెల్సీతో చర్చించిన ఓ మాజీ ఎమ్మెల్యే

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత రాసిన లేఖ నేపథ్యంలో జిల్లా పార్టీ శ్రేణుల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. పైకి ఏమీ మాట్లాడలేకపోతున్నామని, లోలోపల ఎటూ తేల్చుకోలేకపోతున్నామంటూ ఆది నుంచి పార్టీలో పనిచేస్తున్న పార్టీ హార్డ్‌కోర్ కార్యకర్తలు, ఉద్యమకారులు గందరగోళంలో ఉన్నారు. మరోవైపు జిల్లాలో కవిత ద్వారా పదవులు పొందిన వారు, కవిత అనుచరులుగా కొనసాగుతున్న నాయకులు, కార్యకర్తలు సైతం ఎటూ తేల్చుకోలేక గుంభనంగా ఉంటున్నారు. కవిత మెట్టినిల్లు కావడంతో పాటు ఎమ్మెల్సీగా ఆమె ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో లేఖ అంశం, తదనంతరం చోటుచేసుకుంటున్న పరిణామాలపై జిల్లాలో ప్రతిఒక్కరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. దీంతో పార్టీ శ్రేణులు ఏంమాట్లాడాలో అనే విషయమై తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఉద్యమ సమయం నుంచి కవిత ఆధ్వర్యంలో నడుస్తున్న జాగృతి శ్రేణులు సైతం ఏం జరుగుతుందోనంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

లేఖలోని ఉద్యమకారులకు గుర్తింపు లేదన్న అంశానికి మద్దతు..

పార్టీ శ్రేణుల్లో ఎవరూ బయటకొచ్చి మాట్లాడకున్నప్పటికీ ఉద్యమకారుల గురించి కవిత లేఖలో ప్రస్తావించడంపై పలువురు సీనియర్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం కవిత బహిరంగ వేదికలపై ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యత దక్కలేదంటూ జిల్లాకు చెందిన పలువురి పేర్లు అనేకసార్లు ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేసుకుంటున్నారు. కవిత ప్రస్తావించిన అంశాలకు మద్దతిస్తున్నట్లు ఇందల్వాయి మాజీ ఎంపీపీ స్పందించడం గమనార్హం. కవిత ద్వారా నామినేటెడ్ పదవులు పొందినవారు, అదేవిధంగా కవిత అండతో స్థానిక ప్రజాప్రతినిధులుగా వ్యవహరించినవారు, ఉద్యమకారులు సైతం కవితకు ఇప్పటికీ మద్దతుగా ఉన్నామని అంతర్గతంగా చెబుతున్నప్పటికీ బహిరంగంగా మాట్లాడేందుకు ఇప్పటికైతే ముందుకు రావడం లేదు.

అయితే పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, జాగృతిలో పనిచేస్తున్న కవులు, కళాకారులు మాత్రం కవితకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మా బలం, మా ధైర్యం, మా నమ్మకం మీరే కవితక్క అంటూ, డాటర్ ఆఫ్ ఫైటర్ అంటూ కవిత, కేసీఆర్ ఫొటోలతో పోస్టులు పెడుతున్నారు. ఇక గత ఏడాది జాగృతి కమిటీలు రద్దు చేయగా, కొత్త కమిటీల కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్న పలువురు కవిత వైపే తామున్నామంటూ చెబుతున్నప్పటికీ బహిరంగంగా చర్చించేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం.

ఇదిలా ఉండగా కవిత లేఖ బహిర్గతం అయ్యాక అమెరికా నుంచి రాగానే జాగృతి కార్యకర్తలు స్వాగతం పలికిన సమయంలో జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే ఒకరు ఆమెను కలిసినట్లు చర్చ జరుగుతోంది. కవిత పార్టీ ఏర్పాటు చేస్తే ఆమెతో వెళ్లేందుకు సిద్ధమేనని పలువురు పార్టీ కార్యకర్తలు చెబుతున్నప్పటికీ గందరగోళంలోనే ఉన్నారు.

పేరు మార్పుపై ప్రచారం..

మంగళవారం హైదరాబాద్‌లో జాగృతి సింగరేణి కమిటీ సమావేశాన్ని కవిత నిర్వహించిన నేపథ్యంలో జిల్లాలో జాగృతి కార్యకర్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. భారత జాగృతి నుంచి మళ్లీ తెలంగాణ జాగృతిగా మార్పు చేసి తాజాగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో మహిళా నాయకులు కవితకు మద్దతుగా ఉన్నామని చెబుతున్నప్పటికీ బహిరంగంగా మాట్లాడడం లేదు.

ధాన్యం సేకరణలో మొదటిస్థానం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన అదనపు కలెక్టర్లు

- జిల్లాలో రికార్డు స్థాయిలో 8.19లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- అభినందించిన ముఖ్యమంత్రి, మంత్రులు
- గతేడాదితో పోలిస్తే దాదాపు రెట్టింపు స్థాయిలో సేకరణ
- 1,00,535 మంది రైతులకు రూ.1786.13 కోట్ల చెల్లింపు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి

నిజామాబాద్‌అర్బన్: ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ఉప ముఖ్యమంత్రి భ ట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ధాన్యం సేకరణ, ఖరీఫ్ సాగుకు సన్నద్ధత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ అంశాలపై సమీక్షించారు.

ధాన్యం సేకరణ – ఖరీఫ్ సాగు

జిల్లాలో ఇప్పటికే 8.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారని, ఇదే స్ఫూర్తితో మిగతా ధాన్యా న్ని సైతం పూర్తి స్థాయిలో సేకరించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు లు ఇబ్బందులు పడకుండా చూడాలని, మిల్లర్లు, దళారులు రైతులను నష్టపరిచేవిధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రుతుపవనాలు ప్రవేశించిన నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై అవసరమైతే పీడీ యాక్టు ప్రయోగించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతంగా సాగేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సీఎం సూ చించారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ మినహా అన్ని మండలాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు.

సన్నరకాలే అధికం..

వీడియోకాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గతేడాది రబీ సీజన్‌లో ఇదే సమయానికి 4.34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించగా, ఈ ఏడాది రికార్డు స్థాయిలో 8.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ రబీ సీజన్‌లో ఇప్పటికే 3.85 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఎక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోళ్లు జరిగాయని వివరించారు. 700 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టామని, కొనుగోళ్లు పూర్తయిన నేపథ్యంలో 625 కేంద్రాలను మూసివేశామని, 75 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశలో ఉందని తెలిపారు. సేకరించిన ధాన్యంలో సింహభాగం సన్నరకం ధాన్యం 7.26 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, దొడ్డు రకం ధాన్యం 93.24 వేల మెట్రిక్ టన్నులు మాత్రమేనని వివరించారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి 100535 మంది రైతుల ఖాతాల్లో రూ.1786.13 కోట్ల బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి ఒక్క టీఎంసీ..

- వారం రోజుల్లో ఎగువ నుంచి ఇన్‌ఫ్లో
- మే నెలలో ఈ స్థాయి వరద ఇదే తొలిసారి

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఒక్క టీఎంసీ వరద నీరు వచ్చి చేరింది. ఈ నెల 21 నుంచి వర్షాలు కురుస్తుండటంతో 2,300 క్యూసెక్కులతో ప్రారంభమైన ఇన్‌ఫ్లో గరిష్ఠంగా 2,700కు చేరింది. నీటి నిల్వ 11.2 టీఎంసీల నుంచి 12.2 టీఎంసీలకు పెరిగింది. మే నెలలో ఒక్క టీఎంసీ ఇన్‌ఫ్లో రావడం ప్రాజెక్ట్ చరిత్రలో ఇదే తొలిసారని రికార్డులు తెలుపుతున్నాయి.

వేగంగా నీరు వచ్చే అవకాశం

జూన్‌లో వర్షాలు ప్రారంభమై ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వస్తే వేగంగా ప్రాజెక్టులోకి నీరు చేరే అవకాశం ఉంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల్లోని గుంతలు పూర్తిగా నిండడంతో ఎక్కడ ఆగకుండా నేరుగా వచ్చి చేరి ప్రాజెక్ట్ వేగంగా నిండే అవకాశం ఉంది.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎగువ నుంచి ప్రస్తుతం 652 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 321 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 1061.5(12.2 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

వన మహోత్సవానికి సన్నద్ధం

- నైరుతి రుతుపవనాల రాకతో అధికారుల కసరత్తు
- మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించాలని ఆదేశాలు
- ఈ ఏడాది 28.87లక్షల మొక్కలు నాటనున్న గ్రామీణాభివృద్ధి శాఖ



డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

డొంకేశ్వర్(ఆర్మూర్): నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నేపథ్యంలో వన మహోత్సవానికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. 11వ విడతలో మొక్కలు నాటేందుకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ ఆ దిశగా కసరత్తు ప్రారంభించింది. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని ఎంపీడీవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో వారు అంచనాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఈ ఏడాది 28.87లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా, ఇందుకోసం గతేడాది 530 నర్సరీల్లో విత్తనాలు వేసి 48లక్షల వరకు మొక్కలను పెంచారు. ప్రస్తుతం అవి పెరిగి నాటడానికి సిద్ధంగా ఉన్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో మూడు వేల చొప్పున మొక్కలు నాటాలని ఆదేశాలున్నాయి. త్వరలోనే ఉపాధిహామీ కూలీల ద్వారా గుంతలను తవ్వించి రోజువారీగా టార్గెట్‌ను నిర్దేశించనున్నారు. అయితే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జూన్ మొదటి వారం నుంచి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామని, నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటామని డీఆర్డీవో సాయాగౌడ్ 'సాక్షి'కి తెలిపారు.



చాలా రకాల మొక్కలు

గ్రామీణాభివృద్ధి శాఖ నర్సరీల్లో చాలా రకాల మొక్కలను పెంచింది. మునగ, వేప, దానిమ్మ, కానుగ, చింత, టేకు, ఈత, జామ, ఖర్జురా, తాటి, అల్లనేరేడు వంటి వెరైటీ మొక్కలను పెంచుతున్నారు. ఈ ఏడాది లక్షా 50వేల ఈత మొక్కలు నాటేందుకు నర్సరీల్లో సిద్ధం చేశారు. 20వేల ఖర్జురా మొక్కలు కూడా ఉన్నాయి. వీటితోపాటు గుల్‌మోహర్, గులాబీ, తెల్ల జిల్లేడు వంటి పూల రకాల మొక్కలను సైతం పెంచారు. వీటిని ఇంటికి ఐదు చొప్పున పంపిణీ చేయనున్నారు.

మండలాల వారీగా మొక్కలు నాటే లక్ష్యం

మండలం	టార్గెట్	జక్రాన్‌పల్లి	1,19,661	నవీపేట్	1,66,232
ఆర్మూర్	1,41,663	కమ్మర్‌పల్లి	89,349	నిజామాబాద్	87,299
బాల్కొండ	67,465	కోటగిరి	1,48,598	రెంజల్	1,01,682
భీమ్‌గల్	1,38,117	మాక్లూర్	1,35,040	రుద్రూర్	57,595
బోధన్	1,85,648	మెండోరా	65,731	సిరికొండ	1,34,565
చందూర్	26,930	మోర్తాడ్	74,105	వర్ని	1,02,097
ధర్పల్లి	1,15,422	మోస్రా	30615	వేల్పూర్	1,17,703
డిచ్‌పల్లి	1,68,959	మోపాల్	49,162	ఎడపల్లి	98,347
ఇందల్వాయి	1,19,548	నందిపేట్	1,92,093	ఏర్గట్ల	45,958

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు.సబ్జెక్ట్ లెక్చరర్లు ఆర్డర్ కాపీలను కళాశాల లాగిన్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్‌లు అధ్యాపకులను రిలీవ్ చేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన పరీక్షలు

ఇంటర్ సప్లిమెంటరి పరీక్షలు ముగిశాయి. చివరి రోజైన మంగళవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరుగగా, 7252 మందికి గాను 6859 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 2766 మందికిగాను 2641 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వయోవృద్ధుల సమస్యలపై స్పందించాలి

నిజామాబాద్ అర్బన్: వయోవృద్ధుల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. వయోవృద్ధుల సంక్షేమం, వివిధ అభివృద్ధి పథకాల్లో వృద్ధుల సంరక్షణ, పోషణ నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిత్ మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో పోషణ, నిర్వహణ చట్టం అనుసరించి ఇప్పటివరకు 13 దరఖాస్తుల్లో 12 మంది వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అంతేకాకుండా 1558 మంది సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. 67,312 మంది వృద్ధులకు డీఆర్డీఏ ద్వారా వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేశామన్నారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు విచారణ చేపట్టి సత్వరమే పరిష్కరించాలన్నారు. తమకు ఏదైనా సమస్య ఎదురైతే వయోవృద్ధులు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2,25,383 మంది వయోవృద్ధులు ఓటు హక్కు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్ బీ, అదనపు డీసీపీ బస్వారెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయాధికారితో సాక్షి ఫోన్ ఇన్..

ముందస్తు నైరుతి రుతుపవనాల రాకతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే పంటల సాగుకు ఈ వాతావరణం అనుకూలమేనా? అనుకూలమైతే ఏయే పంటలు ముందుగా వేయాలి? ఎరువులు, విత్తనాల లభ్యత, నకిలీ విత్తనాలను గుర్తించడం ఎలా? వరి నారు మడుల్లో సమస్యలు, తదితర అంశాలపై రైతులు ప్రశ్నలు అడగవచ్చు.



జి. వీరాస్వామి,
జిల్లా వ్యవసాయాధికారి

తేది : 28-05-2025 (బుధవారం)

సమయం: ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: 89777 51940 / 9959412852

క్లుప్తంగా

విద్యుత్‌ ఉద్యోగుల సంక్షేమానికి చారిత్రక నిర్ణయం

- సీఎం, డిప్యూటీ సీఎంలకు కృతజ్ఞతలు తెలిపిన ఈఈ జేఏసీ

సుభాష్‌నగర్‌: విద్యుత్‌ ఉద్యోగుల సంక్షేమానికి రూ.కోటి గ్రూప్‌ ఇన్సూరెన్స్‌ స్కీమ్‌ను మంజూరు చేస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎన్‌పీడీసీఎల్‌ వరుణ్‌రెడ్డికి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్‌ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ (ఈఈ జేఏసీ) ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న లైన్‌ సిబ్బంది, ఫీల్డ్‌ వర్కర్ల త్యాగాలను గుర్తించి తీసుకున్న ఈ నిర్ణయం ప్రజా అభిముఖ ప్రభుత్వాన్ని ప్రతిబింబిస్తుందని కొనియాడారు. మరింత నిబద్ధతతో విధులు కొనసాగిస్తామని నిజామాబాద్‌ ఈఈ జేఏసీ, ఉద్యోగ సంఘాలు, ట్రేడ్‌ యూనియన్ల ప్రతినిధులు బీ రఘునందన్‌, శ్రీనివాస్‌, తోట రాజశేఖర్‌, ఆర్‌ మల్లేశ్‌, బీ సురేశ్‌, కే రాజేందర్‌ తదితరులు పేర్కొన్నారు.

సజ్జ సీడ్‌ ఆర్గనైజర్ల నిలదీత



నాగంపేట్‌లో సీడ్‌ ఆర్గనైజర్లను నిలదీస్తున్న రైతులు

బాల్కొండ: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఎందుకు కొనుగోలు చేయరని ముప్కాల్‌ మండలం నాగంపేట్‌, రెంజర్ల గ్రామ రైతులు సీడ్‌ ఆర్గనైజర్లను మంగళవారం నిలదీశారు. ఇటీవల కురిసిన వర్షాలతో తడిసిన సజ్జను సీడ్‌ కంపెనీల ఆర్గనైజర్లు పరిశీలించేందుకు వచ్చారు. దీంతో కంపెనీ పెట్టిన నిబంధనలతోనే పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆరోపించారు. 85 రోజుల్లో కోత కోసే పంటను 90 రోజులకు వరకు కోత కోయనివ్వకుండా చేయడంతోనే వర్షాలు కురిసి నష్టపోయామన్నారు. రైతులకు న్యాయం చేయకుంటే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

‘ఈ-శ్రమ్‌’లో పేర్లు నమోదు చేసుకోవాలి

- కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్‌ యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్‌ యాదయ్య

నిజామాబాద్‌ రూరల్‌: అసంఘటిత రంగ కార్మికులు తమ వివరాలను ‘ఈ-శ్రమ్‌’ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌ యాదయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసంఘటిత కార్మికులు, గిగ్‌ వర్కర్లు ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకుంటే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పనిచేసే ప్రదేశాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వ పరంగా సహాయం అందుతుందని తెలిపారు. సమావేశంలో అధికారులు పలనాటి యోహాన్‌, ప్రభుదాస్‌, కమురుద్దీన్‌, నరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డ.. బాక్సింగ్‌లో దిట్ట

- జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్న యువకుడు
- ఉదార స్వభావులు, ప్రభుత్వం చేయూతనిస్తే అంతర్జాతీయ బాక్సర్‌ను చేస్తానంటున్న తల్లి

ఓ పేదింటి బిడ్డ పోరాట క్రీడ బాక్సింగ్‌లో పట్టుదలతో రాణిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అందరి మన్ననలు పొందుతున్నాడు.

మాక్లూర్‌: మండలంలోని గుత్ప (మాలపల్లి)కి చెందిన రాఘవేంద్ర గతేడాది ఢిల్లీలో జరిగిన అండర్‌-17 విభాగం జాతీయ స్థాయి బాక్సింగ్‌ పోటీల్లో పాల్గొని రెండో రౌండ్‌లోనే ప్రత్యర్థిని నాకౌట్‌కు పంపి విన్నర్‌కప్‌తోపాటు నగదు బహుమతులను అందుకున్నాడు. అప్పటి నుంచి రాఘవేంద్రకు బాక్సింగ్‌పై మరింత పట్టుదల పెరిగింది. ఏనాటికైనా అంతర్జాతీయ స్థాయి బాక్సర్‌గా ఎదిగి తల్లి రుణం తీర్చుకోవాలని మరింత శిక్షణ పొందుతున్నాడు. కొడుకు ఆశయం నెరవేర్చేందుకు తల్లి బాసపల్లి సుజాత పడరాని పాట్లు పడుతోంది. రాఘవేంద్రకు ఊహ తెలియక ముందే నాన్న వదిలేసి వెళ్లిపోయాడు. సుజాత ఒంటరిగానే అన్నీ తానై పెంచింది. కల్లెడి, అడవి మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్టు ఏఎన్‌ఎంగా పనిచేస్తూ తనకు వచ్చే కొద్దిపాటి వేతనంతో కుమారుడికి ఏలోటూ రాకుండా ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు కరీంనగర్‌లోని స్పోర్ట్స్‌ స్కూల్‌లో చదివించింది. రాఘవేంద్ర ప్రస్తుతం హైదరాబాద్‌లోని శారద కళాశాలలో ఇంటర్‌ చదువుతూ, సమయం దొరికినప్పుడు పార్ట్‌టైమ్‌ ఉద్యోగం చేస్తూ బాక్సింగ్‌ కోచింగ్‌ తీసుకుంటున్నాడు. పుట్టెడు ఆర్థిక ఇబ్బందుల్లోనూ పట్టుదలతో అంతర్జాతీయ బాక్సింగ్‌ పోటీల్లో పాల్గొని ఇండియాకు పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాలనుకుంటున్న రాఘవేంద్రకు ఉదార స్వభావులు, ప్రభుత్వం ముందుకు వచ్చి ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అండర్‌-17 జాతీయ స్థాయి బాక్సింగ్‌ పోటీల్లో రాఘవేంద్రను విజేతగా ప్రకటిస్తున్న నిర్వాహకులు



బహుమతిని అందుకుంటున్న రాఘవేంద్ర

ఆర్థిక సహాయం అందించాలి



అంతర్జాతీయ బాక్సర్‌ కావాలన్న పట్టుదలతో ఉన్న రాఘవేంద్రకు ప్రభుత్వం తగిన సహకారం అందించాలి. తండ్రిలేని రాఘవేంద్రకు తల్లి సుజాత కష్టపడడంతోపాటు అప్పులు చేస్తూ బాక్సింగ్‌ శిక్షణ ఇప్పిస్తుంది. ఇప్పటికే ఓసారి జాతీయ స్థాయి బాక్సింగ్‌లో విన్నర్‌ అయ్యాడు. –గంట చిన్నయ్య, మాజీ సర్పంచ్‌, గుత్ప

డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి
- కలెక్టర్‌, కమిషనర్‌తో కలిసి నగరంలోని డ్రెయినేజీలు, లోతట్టు ప్రాంతాల పరిశీలన

నిజామాబాద్‌ సిటీ: ఇందూరు నగరంలో మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నుడా చైర్మన్‌తో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, మున్సిపల్‌ కమిషనర్‌ దిలీప్‌కుమార్‌తో కలిసి లోతట్టు ప్రాంతాలు, డ్రెయినేజీలు, కెనాల్స్‌, పెద్ద స్ట్రామ్‌ వాటర్‌ డ్రెయిన్‌లు పరిశీలించారు. బైపాస్‌ రోడ్డు, నిజాం కాలనీ, బోధన్‌ రోడ్‌, ఆర్‌ఆర్‌ చౌరస్తా, పీఎఫ్‌ ఆఫీస్‌, సాయినగర్‌, వినాయక్‌నగర్‌ తదితర ప్రాంతాల్లోని మురుగు కాల్వలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొత్తగా నిర్మించే మురుగు కాల్వల ప్రతిపాదిత స్థలాలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ అధికారులు వివరించారు. డ్రెయిన్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పెద్ద డ్రెయినేజీలు, డీ-52, డీ-54 కెనాల్స్‌లో పూడికతీత చేపట్టాలని ఆదేశించారు. నగరంలో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. భారీ వర్షాలు కురవక ముందే డీ-సిల్టింగ్‌ పనులను పూర్తి చేయించాలని సూచించారు. నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్‌ ఆదేశించారు. పారిశుధ్య పనులు చేపడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సునీల్‌, శ్రీకాంత్‌లను ఆయన అభినందించారు. నుడా చైర్మన్‌ కేశవేణు, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజారెడ్డి, రైతు కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్‌, సీనియర్‌ నాయకులు నాగేశ్‌ రెడ్డి, కొండపాక రాజేశ్‌, పార్థసారధి, ఈఈ మురళీ మోహన్‌రెడ్డి, మున్సిపల్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ జయకుమార్‌, రషీద్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఉన్నారు.

రెండు విభాగాలుగా బాలికల కళాశాల?

- ఉర్దూ మీడియం విభాగం తరలింపుపై సమాలోచనలు
- మాలపల్లిలో అసౌకర్యాల కారణంగా నిలిపివేసిన అధికారులు



కోటగల్లిలోని బాలికల కళాశాల

నిజామాబాద్‌ అర్బన్‌: కోటగల్లి బాలికల కళాశాలలోని ఉర్దూ మీడియం విభాగం తరలించేందుకు మళ్లీ ప్రయత్నాలు మొదలయ్యాయి. కోటగల్లిలో కొన్నేళ్లుగా తెలుగు, ఉర్దూ మీడియం విభాగాలు కొనసాగుతున్నాయి. ఉర్దూ మీడియం విభాగాన్ని మాలపల్లిలోని బాలికల కళాశాల భవనంలోకి మార్చాలని మైనార్టీ సంఘాలు కోరగా, సరైన సదుపాయాలు లేకపోవడంతో అధికారులు ఆలోచన విరమించుకున్నారు. కాగా, మైనార్టీ విద్యార్థులు కోటగల్లి కళాశాలకు వచ్చేందుకు ఇబ్బందిపడుతున్నారని, ఉర్దూ విభాగాన్ని తరలించాలని కొందరు మైనార్టీ నేతలు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీని కోరారు. దీంతో ఆయన కళాశాల తరలింపుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్‌ ఆదేశాలతో డీఐఈవో రవికుమార్‌ను మాలపల్లిలోని పాత కళాశాల భవనాన్ని పరిశీలించారు. పాత భవనంలో కనీస సౌకర్యాలు లేవని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొనడంతో తరలింపును విరమించుకున్నారు. కానీ, కొందరు మైనార్టీ నాయకులు ఉర్దూ మీడియం విభాగాన్ని తరలించేందుకు మళ్లీ పావులు కదుపుతుండగా, మరికొందరు మాత్రం కోటగల్లిలోనే ఉండాలని భావిస్తున్నారు.

తరలింపును విరమించుకోవాలి

మహిళా కళాశాలలోని ఉర్దూ విభాగాన్ని మాలపల్లికి తరలించే విషయం విరమించుకోవాలి. అన్ని ప్రాంతాల వారికి ఇక్కడ అనుకూలంగా ఉంది. మాలపల్లికి తరలిస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అక్కడి భవనంలో పారా మెడికల్‌ కోర్సులు ఏర్పాటు చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నాలు చేయాలి.
– కైసర్‌, కాంగ్రెస్‌ ప్రచార కమిటీ జాయింట్‌ కన్వీనర్‌

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- డీసీహెచ్‌ఎస్‌ శ్రీనివాస ప్రసాద్‌
- డిచ్‌పల్లి సీహెచ్‌సీ తనిఖీ



మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్‌ శ్రీనివాస ప్రసాద్‌

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌ (ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రి)ని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్‌) డాక్టర్‌ శ్రీనివాస ప్రసాద్‌ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో ఆస్పత్రిని రాష్ట్ర కాయకల్ప ప్రతినిధి బృందం సందర్శించే అవకాశం ఉందన్నారు. మెరుగైన పరిశుభ్రత, వసతి సౌకర్యాలు, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రులకు కాయకల్ప అవార్డు అందజేస్తారని పేర్కొన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, కాయకల్ప బృంద సభ్యులకు సరైన వివరాలు తెలియజేయాలన్నారు. డాక్టర్లు శివశంకర్‌, సందీప్‌ రెడ్డి, అశ్విని, రాజశ్రీ, స్టాఫ్‌ నర్స్‌, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

- రెండు ప్యాకేజీలతో ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చిన ఐఆర్‌సీటీసీ

ఖలీల్‌వాడి: తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్‌ జనరల్‌ మేనేజర్‌ డీఎస్‌జీపీ కిశోర్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్‌ 14 నుంచి జూలై 13 వరకు రెండు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్‌ నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. యాత్రకి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.

ప్యాకేజీ 1:
(గంగ– రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర)

ఈ యాత్రలో (కాశీ)వారణాసి, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగరాజ్‌, శృంగవర్పూర్‌ ప్రాంతాలు దర్శించుకోవచ్చు. జూన్‌ 14న ప్రారంభమై 22 వరకు కొనసాగుతుంది. ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.16,200, 3 ఏసీ ధర రూ.26,500, 2 ఏసీ ధర రూ.35 వేలు ఉంటుంది.

ప్యాకేజీ 2: (ఐదు జ్యోతిర్లింగాల యాత్ర)

ఈ యాత్రలో మహాకాళేశ్వర్‌, ఓంకారేశ్వర్‌, త్రయంబకేశ్వర్‌, భీంశంకర్‌, ఘృష్ణేశ్వర్‌, ఎల్లోరా, మోవ్‌, నాగ్‌పూర్‌ ప్రాంతాలు సందర్శించవచ్చు. జూలై 5న ప్రారంభమై 13 వరకు కొనసాగుతుంది. ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.14,700, 3 ఏసీ ధర రూ.22,900, 2 ఏసీ ధర రూ.29,900 ఉంటుంది. సికింద్రాబాద్‌, కామారెడ్డి, నిజామాబాద్‌, ధర్మాబాద్‌, నాందేడ్‌, ముద్ఖేడ్‌, పూర్ణ మీదుగా ప్రత్యేక రైలు వెళుతుంది.

ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలివే..

రైలు, బస్సు, హోటల్‌, భోజన సౌకర్యం ఉంటుంది. టూర్‌ ఎస్కార్ట్‌ సేవలతో సందర్శనా స్థలాలకు వెళ్లొచ్చు. ప్రయాణ బీమా, రైల్వే స్టేషన్‌ నుంచి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితం. ప్రతి రైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినేటర్లు అందుబాటులో ఉండి సౌకార్యాలు సమకూరుస్తారు. కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డు, సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలిపారు. టికెట్‌ బుకింగ్‌కు 9701360701, 9281030712, 9281495845, 9281030749, 9281030750 నంబర్లను సంప్రదించాలి. పూర్తి వివరాలకు www. irctctourism. com వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

బాలల ప్రతిభ అద్భుతం



మాట్లాడుతున్న డీఈవో అశోక్‌

నిజామాబాద్‌ రూరల్‌: తల్లిదండ్రులు తమ పిల్లలలోని సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలను చేరుకుంటారని జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్‌ పేర్కొన్నారు. బాలభవన్‌ వేసవి శిక్షణ శిబిరంలో పిల్లల ప్రతిభా పాటవ ప్రదర్శనకు డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా బాలభవన్‌ రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం పిల్లలు ‘గోవింద, గోవింద గోవింద అనరే...అన్నమాచార్య కీర్తనపై చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జాదు యుగంధర్‌ రంగనాథ్‌ చేసిన ఇంద్రజాల విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో మనోరమ ఆస్పత్రి నిర్వాహకులు డా.హనీశ్‌ శశిధర్‌ దేశ్‌పాండే, బాలభవన్‌ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ మల్లాది ఉమాబాల, ప్రత్యేకాధికారి విఠల్‌ప్రభాకర్‌, వెంకటలక్ష్మి, పుష్పలత, నటరాజ్‌, లక్ష్మణ్‌, రాంచందర్‌, గణేశ్‌, విజయ, గణేశ్‌, శ్రీలత, సోనాలి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న బాలభవన్‌ పిల్లలు

కుక్కల దాడిలో జింక పిల్లకు గాయాలు



జింక పిల్లను అప్పగిస్తున్న గ్రామస్తులు

రుద్రూర్‌: పొతంగల్‌ మండలం సోంపూర్‌ శివారులో కుక్కల దాడిలో జింక పిల్లకు గాయాలయ్యాయి. పొలాల్లో జింక పిల్లను వెంటాడుతున్న కుక్కల గుంపును గుర్తించిన రైతులు వాటిని తరిమికొట్టారు. జింకను గ్రామంలోకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించి ఫారెస్ట్‌ సెక్షన్‌ అధికారి సురేశ్‌కు అప్పగించారు. జింక పిల్ల బాగుండడంతో అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్టు ఫారెస్ట్‌ అధికారి తెలిపారు.

బీసీలు ఏకమైతే అద్భుతాలు సృష్టించొచ్చు

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు

నిజామాబాద్‌నాగారం: బీసీలందరూ ఏకమైతే అద్భుతాలను సృష్టించొచ్చని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా మహాసభ మంగళవారం స్థానిక కపిల హోటల్‌లో భూమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుంజయ నాయుడు మాట్లాడుతూ...తరతరాలుగా చేతి వృత్తిదారులు, ఉత్పత్తి కులాల వారు అణచివేతకు గురవుతున్నారని, వారి హక్కుల సాధన కోసం మడమ తిప్పని పోరాటం చేస్తామన్నారు. అన్ని జిల్లాల్లో నియోజకవర్గ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్‌ మాట్లాడుతూ.. దేశంలో బీసీలు మెజారిటీ ప్రజలుగా ఉన్నప్పటికీ ద్వితీయ శ్రేణి పౌరులుగానే బతకాల్సి వస్తోందని, ఇటీవల కాలంలో తెలంగాణలో బీసీ ఉద్యమాలు ఊపందుకోవడం హర్షించదగ్గ పరిణామమన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు చక్రపాణి, విఠల్‌ గౌడ్‌, శ్రావణ్‌, పుప్పాల నాందేవ్‌, డీహెచ్‌పీఎస్‌ అధ్యక్షుడు కమలాపురం, రాజన్న, రేవతి, గోవర్ధన్‌, రాఘవేందర్‌, రాధా కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఓ ఫంక్షన్‌ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులను సన్మానించారు. పాతికేళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపై కలువడంపై ఆనందం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్‌

కారు ఢీకొని వృద్ధురాలు మృతి

మాక్లూర్‌: అమ్రాద్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. ఆ ర్మూర్‌ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన జీవమ్మ(78) కొంతకాలంగా అమ్రాద్‌లోని తన కుమార్తె వద్ద ఉంటుంది. మంగళవారం ఉదయం నడవలేని స్థితిలో ఉన్న జీవమ్మ దేకుతూ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మనుమడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

భిక్కనూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మెదక్‌ జిల్లా రామాయంపేట్‌ గ్రామానికి చెందిన మహ్మద్‌ అన్వర్‌ (46) భిక్కనూరు గ్రామంలో సైకిల్‌ టెక్స్‌ పనిచేస్తుంటాడు. సోమవారం రాత్రి పనిముగించుకున్న అన్వర్‌.. వేద విహార్‌ వెంచర్‌లో ఉండే తమ్ముడు ఫాజిల్‌ అహ్మద్‌ ఇంటికి సైకిల్‌పై వెళుతుండగా లారీ ఢీకొట్టింది. క్షతగాత్రుడిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్‌ గ్రామానికి చెందిన వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు. మర్కల్‌లోని సింపల్లి సాయవ్వ(42) ఐదేళ్లుగా నడుము నొప్పితో బాధపడుతోంది. నెల రోజుల క్రితం ద్విచక్రవాహనంపై నుంచి పడడంతో చేయి విరిగి మంచం పట్టింది. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. భర్త మల్లయ్య గమనించి వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి ఈ నెల 25న నిజామాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ డివిజన్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ ఐదుగురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ రాజా వెంకటరెడ్డి తెలిపారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు డివిజన్‌లోని అన్ని పీఎస్‌ల పరిధిలో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించగా 31 మంది పట్టుబడ్డారని పేర్కొన్నారు. మార్నింగ్‌ కోర్టులో మంగళవారం హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజులు, ఒకరికి మూడు రోజులు, ఇద్దరికి నాలుగు రోజుల శిక్ష విధిస్తూ స్పెషల్‌ జ్యుడిషియల్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ బేగం తీర్పునిచ్చారు. మిగతా 26 మందికి జరిమానా విధించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



ధర్మరాజు(ఫైల్‌)

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన ఎర్ర ధర్మరాజు (34) మంగళవారం ఉదయం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సుహాసిని తెలిపారు. కొద్దిరోజులుగా ధర్మరాజు అప్పులతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆయన పెద్ద కూతురు అనారోగ్యం బారినపడింది. దీంతో మనస్తాపానికి గురైన ధర్మరాజు ఉదయం తన పొలంలోని చెట్టు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఎర్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సుహాసిని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



బిచ్కుంద(జుక్కల్‌): మండలంలోని పుల్కల్‌, హజ్గుల్‌ సమీపంలో మంజీర నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఉదయం 6 గంటలకు పట్టుకున్నట్లు తహసీల్దార్‌ వేణుగోపాల్‌ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జరిమానా విధిస్తామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ కాయిల్స్‌ చోరీ

వర్ని: మోస్రా మండలం గోవూర్‌ శివారులో మూడు విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల కాయిల్స్‌, ఆయిల్‌ను దుండగులు చోరీ చేశారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు రెండు గంటల ప్రాంతంలో చోరీ జరిగినట్లు స్థానిక రైతులు తెలిపారు. విద్యుత్‌ శాఖ అధికారులకు సమాచారం అందించామన్నారు.

మహిళ దారుణ హత్య

- అత్యాచారం చేసి అంతమొందించినట్లు అనుమానం



సుమలత (ఫైల్‌)




మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, డాగ్‌ స్క్వాడ్‌ సిబ్బంది

నందిపేట్‌(ఆర్మూర్‌): నిర్మానుష్య ప్రాంతంలో మహిళను హత్య చేసిన ఘటన నందిపేట మండలంలోని అయిలాపూర్‌ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నందిపేట మండలంలోని శాపూర్‌ గ్రామానికి చెందిన సాదా సుమలత (42) 20 సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో కూలీ పని చేసుకుంటూ తన కుమారుడితో కలిసి జీవిస్తుంది. సోమవారం మధ్యాహ్నం నందిపేట మండలంలోని సీహెచ్‌ కొండూర్‌ గ్రామంలో బంధువుల ఇంట్లో తొట్లె ఫంక్షన్‌కు వెళ్లిన తర్వాత అక్కడి నుంచి నందిపేట వారాంతపు సంతకు వెళ్లి కూరగాయలు తీసుకొని వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. రాత్రి అయినా సుమలత ఇంటికి రాకపోవడంతో కొడుకు సాదా సంజయ్‌, బంధువులు కలిసి చుట్టు పక్కల వెతికారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం అయిలాపూర్‌ శివారులోని గుత్ప లిఫ్ట్‌ కాలువ పక్కన పొలం పనుల నిమిత్తం ఎర్రటి రవి వెళ్లగా బండ రాళ్ల వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వెళ్లి సాదా సుమలతగా గుర్తించారు.

అత్యాచారం చేసి..

సాదా సుమలతను తెలిసిన వ్యక్తులే నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువచ్చి మద్యం సేవించిన అనంతరం అత్యాచారం జరిపి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి ఆర్మూర్‌ రూరల్‌ సీఐ శ్రీధర్‌ రెడ్డి, క్లూస్‌ టీం బృందం చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహం పక్కన మద్యం బాటిల్‌తోపాటు గ్లాసులు, వాటర్‌ బాటిల్‌ ఉన్నాయి. ఉరి వేసి చంపినట్లు మృతురాలి మెడకు గాట్లు ఏర్పడ్డాయి. పక్కనే వైరు తాడు సైతం పడేసి ఉంది. డాగ్‌ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా.. అది నందిపేటలోని వివేకానంద చౌరస్తా వద్దకు వచ్చి ఆగిపోయింది. మృతురాలి కొడుకు సంజయ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

భూ తగాదాలో మహిళ..



జాదవ్‌ లక్ష్మీబాయి మృతదేహం

నిజాంసాగర్‌(జుక్కల్‌): భూ తగాదాలో ఓ మహిళ దారుణ హత్యకు గురైన ఘటన జుక్కల్‌ మండలం హంగర్గ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై భువనేశ్వర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అన్నదమ్ములు జాదవ్‌రావ్‌ సాబ్‌ పటేల్‌, పండిత్‌ రావు మధ్య కొన్నిరోజులుగా భూ వివాదాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం జాదవ్‌ రావ్‌ సాబ్‌ వేసిన జొన్న చేనును పండిత్‌రావు కొడుకు బాలాజీరావ్‌ కోస్తుండగా రావ్‌ సాబ్‌ భార్య జాదవ్‌ లక్ష్మీబాయి(45) అడ్డుకున్నది. భూమి తమదంటే తమదని ఇరుకుటుంబాల వారు వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో బాలాజీరావ్‌.. లక్ష్మీబాయి మెడపై గొడ్డలితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాడిలో లక్ష్మీబాయి చిన్న కొడుకు శుభంరావు కాలు, చెయి విరగడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.